



● బ్యాంక్ ఆఫ్ ఇండియా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, పెమ్మసాని, నారాయణ, శ్రావణ్‌కుమార్



ఇన్సూరెన్స్ కార్యాలయాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, కేశవ్

ఆర్థిక నగరానికి.. అంకురార్పణ







చంద్రబాబుకే సాధ్యం

దేశంలో తొలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను సైబరాబాద్‌లో చంద్రబాబు నిర్మించారు. అమరావతిలో ఆర్థిక రాజధానిగా ఫైనాన్షియల్ స్ట్రీట్‌ను నిర్మించే అవకాశం ఆయనకే రావడం అసాధారణం. నాడు హైదరాబాద్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అమలు చేసిన కార్యక్రమాలు నేడు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చి ఆర్థిక ఫలాలు అందిస్తున్నాయి. ఎంతో క్లిష్టమైన ఈ బాధ్యతని ఆయన తన భుజాలపై మోసి విజయం సాధిస్తారు.

- నిర్మలా సీతారామన్

ప్రజా రాజధానిగా పరుగులు పెడుతున్న అమరావతి.. ఇక ఆర్థిక కేంద్రంగా మారనున్నది. ప్రధాన బ్యాంకులు అమరావతి కేంద్రంగా కార్యకలాపాలకు అంకురార్పణ జరిగింది. రాజధానిలో ఆయా బ్యాంకులకు కేటాయించిన స్థలాల్లో శుక్రవారం భూమిపూజ జరిగింది. ముంబై నుంచి వచ్చిన ఆర్థిక దిగ్గజ సంస్థల ప్రతినిధులు, బ్యాంకుల ప్రధాన అధికారులు, రాజధాని రైతులు, ఉపముఖ్యమంత్రి, మంత్రుల సమక్షంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఈ వేడుక కోసం ఆర్థికశాఖకు సంబంధించిన ప్రముఖులు అమరావతిలో కొలువుదీరారు. రాజధానిలో బ్యాంకింగ్ రంగం బలోపేతం కావడంతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం చేరువ కానుందని వారు ప్రకటించారు.

ఇక ఆర్థిక కేంద్రంగా అమరావతి

- ఒకేచోట 13 బ్యాంకులు కొలువుదీరేలా ప్రణాళిక
- రాజధానిలో బ్యాంక్ కార్యాలయాలకు శంకుస్థాపన
- భూమిపూజ చేసిన నిర్మలాసీతారామన్, చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో అట్టహాసంగా కార్యక్రమాలు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతిలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని నగరం అమరావతిలో ఒకే చోట 13 బ్యాంకులు కొలువుదీరేలా ఆర్థిక నగరానికి శుక్రవారం అంకురార్పణ జరిగింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రుల సమక్షంలో అట్టహాసంగా బ్యాంకు కార్యాలయాలకు శంకుస్థాన జరిగింది. రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలోని బ్లాక్ 1 వద్ద ఏర్పాటు చేసిన 13 జాతీయ, (మిగతా 8వ పేజీలో)





మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, హాజరైన వివిధ బ్యాంకుల ప్రతినిధులు

టెండర్లు ఖరారు!

తాగునీటి పథకాల విస్తరణ పనులకు టెండర్లు ఖరారయ్యాయి. నెల రోజుల్లో పనులు ప్రారంభించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీంతో గుంటూరు కార్పొరేషన్, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రూ.501.07 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడు తున్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధి (యూఐడీఎఫ్) నుంచి నిధులు విడుదలయ్యాయి. ఈ ప్రాజెక్టును నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) ద్వారా నిర్వ హిస్తున్నారు. రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు తగ్గట్టుగా తాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు అటెక్కించిన నీటి పథకాల విస్తరణను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది.



పిడుగురాళ్లలో వైసీపీ హయాంలో నిలిచిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం

- నెలలో నీటి పథకాల పనులు ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న పబ్లిక్ హెల్త్ శాఖ
- రూ.501.07 కోట్ల వ్యయంతో విస్తరణ



బుగ్గవాగు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మెగా సంస్థ దాఖలు చేసిన టెండర్లు ఖరారు చేసినట్లు పబ్లిక్ హెల్త్ శాఖ చీఫ్ ఇంజనీరు ఎం ప్రభాకరరావు తెలిపారు. నీటి పథకాల నిర్మాణం పూర్తయిన అనంతరం ఏడు సంవత్సరాలు వాటి నిర్వహణ బాధ్యతలు కూడా సదరు సంస్థకు అప్పగిస్తూ టెండర్‌లో పేర్కొన్నారు. నిర్వహణకు సంబంధించి గుంటూరు కార్పోరేషన్, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలతో అగ్రిమెంట్ చేసుకోవాలని సదరు సంస్థకు సూచిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుగ్గవాగు నుంచి పైపులైన్ నిర్మాణం

మాచర్ల, పిడుగురాళ్ల మునిసిపాల్టీల్లో ఏడాది పొడవునా తాగునీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాలను అభివృద్ధి చేస్తున్నారు. బుగ్గవాగు నుంచి నీటిని ఆయా మునిసిపాలిటీలకు సరఫరా చేసేందుకు (మిగతా 8వ పేజీలో)



దిత్వా.. అలర్ట్

- తుఫాన్‌తో జిల్లాకు వర్ష సూచన

నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దిత్వా రూపంలో మరో తుఫాన్ దూసుకువస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో బలపడిన దిత్వా తుఫాన్ ప్రభావం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలపై ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తుఫాన్ ప్రభావంతో శనివారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసినిది. దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు చెట్ల కింద నిలబడరాదని విపత్తుల నిర్వహణ సంస్థ తెలియ జేసింది. మంగళవారం వరకు మత్స్యకా రులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. రైతులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రైతు కంట కునుకు కరువు...

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో వరి సాగు చేసిన రైతు కంట కునుకు కరువైంది. మొన్నటి దాకా మొంథా తుపాన్ ప్రభావం వల్ల అల్లాడిపోయిన రైతుల్లో దిత్వాతో ఆందోళన నెలకొంది. చాలా చోట్ల కోసిన ధాన్యం చేలల్లోనే ఉంది. కళ్లాల్లో ఉన్న ధాన్యం వర్షాలకు తడిస్తే మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. వర్షంతో పంట పూర్తిగా దెబ్బ తినే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని సీసీఐ కొనుగోలు చేయడం లేదు. తేమ శాతం 15 నుంచి 22 వరకు ఉండగా సీసీఐ 12 శాతం లోపు తేమ ఉంటేనే మద్దతు ధర చెల్లిస్తామని సీసీఐ చెబుతుంది. ఈ పరిస్థితి లో తీసిన పత్తిని ఇంట్లో నిల్వ ఉంచే అవకాశం లేని రైతులు క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ తుఫాన్ వస్తే మరో నెల వరకు పత్తిలో తేమ శాతం తగ్గే అవకాశం ఉండదు.

బర్లీ.. బంద్

- అదనపు కొనుగోళ్లు లేనట్లే
- మార్క్‌ఫెడ్ నిర్ణయంతో రైతుల్లో నిరాశ
- బకాయిలు విడుదల.. ప్రాసెసింగ్‌కు టెండర్లు



(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల వద్ద ఇంకా బర్లీ పొగాకు నిల్వలు గణనీయంగానే ఉన్నాయి. రైతుల వినతి మేరకు అదనపు కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. మొంథా తుఫాన్ ధాటికి బర్లీ పొగాకుకు కూడా నష్టం జరిగిందని, అదనపు కొనుగోళ్లకు కొన్ని మినహాయింపులతో అనుమతి ఇవ్వాలని రైతులు అభ్యర్థించారు. ఈ పరిస్థితుల్లో త్వరలో అదనపు కొనుగోళ్లకు అనుమతి వస్తుందని రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే వారిని నిరాశ పరుస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకుంది. బర్లీ కొనుగోళ్ల అంకం ముగిసినట్లేనని, అదనపు సేకరణ లేదని రాష్ట్రస్థాయి అధికారులు స్పష్టం చేశారు. కానీ ఇంకా క్షేత్రస్థాయిలో దాదాపు 40,000 క్వింటాళ్ల బర్లీ పొగాకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. అయినా ఇకపై కొనేది లేదనే మార్క్‌ఫెడ్ నిర్ణయంపై రైతుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రభుత్వం పునరాలోచించి కనీసం మరో 20,000 క్వింటాళ్ల బర్లీ పొగాకును సేకరించడానికి అనుమతి ఇవ్వాలనే అభ్యర్థనలు రైతుల నుంచి వస్తున్నాయి. మార్క్‌ఫెడ్ తీసుకున్న నిర్ణయం పట్ల స్థానికంగా ఉండే నేతల్లోనూ అసంతృప్తే కనబడుతుండడం గమనార్హం.

కేటాయించిన నిధుల సంగతేంటి..

బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం ఆరంభంలోనే మార్క్‌ఫెడ్ రూ.273 కోట్లను కేటాయించింది. ఈ నిధులన్నీ బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని బర్లీ రైతుల మేలు కోసం కేటాయించినవే. అయితే కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.123 కోట్లు మిగులు ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బర్లీ (మిగతా 8వ పేజీలో)

డీ-అడిక్షన్ సెంటర్ లేక అవస్థలు

- జిల్లాలో పెరిగిపోతోన్న డ్రగ్స్ వ్యసనం

వినుకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్న వారి సంఖ్య జిల్లావ్యాప్తంగా అధికమవుతోంది. వినుకొండ ప్రాంతంలో మత్తు బానిసలు పెరిగిపోతున్నారు. జిల్లాలో డ్రగ్స్ వ్యసనం వేగంగా పెరుగుతుంది. అయితే జిల్లా పరిధిలో ఎక్కడా కూడా డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయలేదు. దీంతో మత్తు బానిసలకు చికిత్స కోసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. డీ-అడిక్షన్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో గుంటూరు జీజీహెచ్, విజయవాడ, ఒంగోలు వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇది ఆయా కుటుంబాలకు ఆర్థిక, మానసిక భారం అవుతుంది. వ్యసనాలకు అలవాటు పడిన యువకులు హింసాత్మక ప్రవర్తనలు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నాలు పెరుగుతున్నాయని కుటుంబసభ్యులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బస్టాండ్ సెంటర్‌లో గంజాయి, మద్యం మత్తులో చిన్న గొడవ ఓ యువకుడి ప్రాణం పోవడానికి కారణమైంది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో నిత్యం జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు పట్టుకున్న డ్రగ్స్ వ్యసనపరులకు కౌన్సెలింగ్ కోసం తీసుకెళ్లే సదుపాయం లేకపోవడంతో వారిని తిరిగి వదిలేస్తున్నారు. ఇది స్థానికంగా క్రైమ్ రేటు పెరగడానికి కూడా కారణమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు నరసరావుపేటలో డీ-అడిక్షన్ సెంటర్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సుల భద్రతపై రాజీ పడేదిలేదు

రవాణా శాఖ జిల్లా అధికారి సంజీవ్‌కుమార్



- ప్రైవేటు పాఠశాలల బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ జిల్లా అధికారి సంజీవ్‌కుమార్, సిహెచ్ రాంబాబు

పిడుగురాళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల బస్సుల భద్రత విషయంలో రవాణా శాఖ ఎటువంటి రాజీ పడదని జిల్లా రవాణా శాఖాధికారి సంజీవ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక స్కాలర్స్ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు ప్రమాదాలపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పలు ప్రైవేటు స్కూల్ బస్సులను తనిఖీ చేసి సీటింగ్, అద్దాలు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. లైసెన్స్, ఫోన్ నెంబర్ల వివరాలను బాక్స్‌లో అందుబాటులో ఉంచాలని డ్రైవర్లను ఆదేశించారు. రోడ్డుపై బస్సులు నడిపే సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖాధికారులు సీహెచ్ రాంబాబు, ఎ.నాగేశ్వరరావు, స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూఢం.. శుభకార్యాలకు విరామం



ఫిబ్రవరి 17 వరకు ముహూర్తాలు లేవు



ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభ కార్యాలకు మంచిరోజులు లేవు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. శుభకార్యాలతో పాటుగా గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

- తుర్లపాటి ఉమామహేశ్వరశర్మ, కోటప్పకొండ

- ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి
- మూడు నెలల పాటు ముహూర్తాలు నిల్
- 82 రోజుల తర్వాతే శుభ ముహూర్తాలు
- పలు రంగాలపై ఆర్థిక ప్రభావం

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మకాలాలు లేదా మూఢమి లాంటివి జ్యోతిష శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల 26న మార్గశిర మాసం శుద్ధ సప్తి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, పాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు ఉండగా.. పుష్యమాసం శూన్య మాసం అవుతుంది. ఇక (మిగతా 8వ పేజీలో)

సాధ్యమైనంత త్వరలో..

అమరావతి నుంచే కార్యకలాపాలు

● ఏపీ గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో శంకుస్థాపన కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. జాతీయ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర వ్యాప్తంగా 1,351 శాఖలున్నట్లు తెలిపారు. కోటి ముప్పై లక్షల ఖాతాదారులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తూ.. రాష్ట్రంలో అగ్రగామి బ్యాంకుగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధాన కార్యాలయం గుంటూరు బ్రాడీపేటలో పనిచేస్తోందని, అమరావతిలో కేటాయించిన స్థలానికి నిర్మాణ అనుమతులు లభించిన వెంటనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో ప్రధాన కార్యాలయాన్ని గుంటూరు నుంచి అమరావతికి మార్చే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నామని ఛైర్మన్ పేర్కొన్నారు. అదేవిధంగా కొత్త భవనం పూర్తయిన తరువాత బ్యాంక్‌లోని అన్ని కీలక కార్యకలాపాలు అమరావతి నుంచే పర్యవేక్షించబడతాయని ఆయన స్పష్టం చేశారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రివెన్స్ డేలో పాల్గొని వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, సర్వీసు సంబంధిత, బదిలీలకు సంబంధించిన, ఇతర పరిపాలనా సమస్యలపై వినతులు సమర్పించారు. ఎస్పీ మొత్తం 15 వినతులను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును పరిగణించి, సమయానుకూలంగా పరిష్కారం లభించేలా చూడాలని ఆయన సూచించారు.

జడ్పీకి శఠగోపం

- నాదెండ్ల క్వారీ భూమి లీజులో చిత్రాలు
- వసూలు చేసుకునే అద్దె నెలకు రూ.లక్ష
- జిల్లా పరిషత్‌కు చెల్లించేది రూ.14,583
- ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారికే టెండర్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): రాజుల సొమ్ము రాళ్లపాలు అన్న నానుడి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ విషయంలో నిజమవుతోంది. వజ్రం కంటే విలువైన భూములు ఉన్నా వాటి ద్వారా వచ్చే ఫలసాయం మాత్రం పరులపాలవుతోంది. ఇందుకు నాదెండ్ల మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న క్వారీ భూమి చక్కని ఉదాహరణ. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమికి నెలకు అద్దె రూపేణా రూ.లక్ష వరకు ఆదాయం చేకూరుతోంది. కానీ జిల్లా పరిషత్‌కు వచ్చేది మాత్రం రూ.14,583 మాత్రమే. మిగిలిన సొమ్మంతా ప్రయివేట్ వ్యక్తులు హాయిగా అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. సదరు స్థలాన్ని ఎప్పటి నుంచో పాడుకుంటూ అద్దెను అప్పనంగా అనుభవిస్తున్న వ్యక్తికి కొందరు అధికారులు వంతపాడటం వివాదాస్పదమైంది.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా

నాదెండ్ల మండలంలోని గణపవరం గ్రామంలో సర్వే నంబరు 528/సీ/ఏ1లో జిల్లా పరిషత్‌కు 1.12 ఎకరాల భూమి ఉంది. అందులోని 30 సెంట్లకు సెప్టెంబరు 4న వేలం నిర్వహించారు. దానికి సంవత్సరం అద్దె రూ.1.75 లక్షలు చొప్పున చెల్లించేందుకు ముందుకు వచ్చిన వారికి లీజు ఖరారు చేసినట్లు జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశంలో 703 తీర్మానం ప్రవేశ పెట్టారు. వాస్తవానికి సదరు స్థలాన్ని ప్రస్తుతం పాడుకున్న వ్యక్తులే దశాబ్దాలుగా లీజు పొందుతూ వస్తున్నారు.



గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం

గతంలో కేవలం రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే అద్దె చెల్లించే వారు. గడచిన మూడేళ్లలో మాత్రమే అద్దె పెంచుతూ వచ్చారు. జిల్లా పరిషత్ స్థలం వెనుక లీజు దారునికి ఆరు ఎకరాల పొలం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అందులో రెండు ఎకరాల్లో కళాశాల ఉండగా, మిగిలిన నాలుగు ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేసినట్లు సమాచారం. ఆ మొత్తం స్థలంలోకి జడ్పీ స్థలం దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఏ పార్టీ అధికారంలో ఉన్నా జిల్లా పరిషత్ స్థలాన్ని వారికే లీజుకు ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

అన్నీ వ్యాపార దుకాణాలే

వివాదాస్పదమైన గణపవరం జడ్పీ స్థలంలో క్యాటరింగ్ పాయింట్, చికెన్ స్టాల్స్, టీ కొట్లు, మెకానిక్ షాపులు ఉన్నాయి. వారిలో ఒకరు రూ.40 వేలు, మరికొందరు రూ. 20 వేలు నుంచి రూ. 10 వేల వరకు అద్దెలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద నెలకు రూ.లక్ష తగ్గకుండా అద్దె వసూలు అవుతున్నట్లు సమాచారం. అయినా జడ్పీకి వచ్చేది మాత్రం నామ మాత్రమే.

ఎవరినీ రానివ్వకుండా

సాధారణంగా ప్రభుత్వ స్థలాలు లీజు ప్రక్రియ అంటే అందరికీ టెండర్ వేసే అవకాశం కల్పించాలి. కానీ, వివాదాస్పద స్థలం వేలానికి మాత్రం.. మండలస్థాయి అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. టెండర్లు వేసేందుకు ఎవర్నీ రానివ్వకుండా.. అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జడ్పీ స్థాయీ సంఘం సమావేశంలోనూ సదరు స్థలం టెండర్ ప్రక్రియకు సంబంధించిన తీర్మానం ఆమోదించేది లేదని జడ్పీటీసీలు భీష్మించారు. ఇదే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. మరి ఈ విషయంలో జడ్పీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

ఏసీబీ, విజిలెన్స్ కేసులు సత్వరమే పరిష్కరించాలి

● 384 గ్రేడ్-2 హాస్టల్ అధికారుల పోస్టులను భర్తీ చేయాలి
● బీసీ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీకి విజ్ఞప్తి



బీసీ సంక్షేమశాఖ చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న కేసన

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన ఉద్యోగుల ఏసీబీ, విజిలెన్స్ కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో పెన్షన్, పదవీ విరమణ ప్రయోజనాలేవీ అందక ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే ఆయా కేసులను పరిష్కరించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ సత్యనారాయణకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ విజ్ఞప్తి చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో ఈ మేరకు చీఫ్ సెక్రటరీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ హాస్టళ్ల లో ఖాళీగా ఉన్న 384 గ్రేడ్ -2 హాస్టల్ అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖలో పనిచేసిన ఉద్యోగులకు సంబంధించి దాదాపు 74 ఏసీబీ/విజిలెన్స్ కేసులు వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిలో ఏసీబీ వద్ద 7, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ వద్ద రెండు, గవర్నమెంట్ వద్ద 33, డైరెక్టర్ బీసీ సంక్షేమ శాఖ వద్ద 4, వివిధ జిల్లా అధికారుల స్థాయిలో 26, అలానే కోర్టులలో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విధంగా వివిధ స్థాయిలలో దీర్ఘకాలికంగా కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యోగులు ఎంతో మానసిక వేదన చెందుతున్నారన్నారు. వీరిలో కొంతమంది ఉద్యోగులు ఇప్పటికే పదవీ విరమణ పొంది, పూర్తిస్థాయి పెన్షన్ గాని ఇతర ఆర్థిక ప్రయోజనాలు పొందలేకపోతున్నారన్నారు. సంబంధిత శాఖల పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

30,872 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 24,794 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 30,872 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,632 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11000	15000
273	----	-----
341	10500	17000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15600
షార్క్-1	----	----
బ్యాడిగి	10500	17600
దేవనూరు డీలక్స్	11000	16800

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	11000	17000
నెంబరు. 5	10500	15800
273	---	----
341	12000	17000
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	15300
బ్యాడిగి	11000	17700
దేవనూరు డీలక్స్	10500	16200
తాలుకాయలు	5000	8200

మద్యం సేవించి ప్రభుత్వాస్పత్రికి రావడం సరికాదు!

●రోగుల సహాయకులతో సూపరింటెండెంట్ రమణ



రోగులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రమణ యశస్వి

గుంటూరు మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొందరు రోగుల సహాయకులు, బంధువులు మద్యం సేవించి ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారని, ఇలా రావడం సరికాదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం మీ కోసం కార్యక్రమంలో రోగులు, వారి సహాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కొందరు విజిటర్లు ఆసుపత్రి లోపలే బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారని, ఆసుపత్రి అంతటా సీసీ కెమెరాలు ఉన్న విషయం వారు గుర్తించాలని తెలిపారు. ఆసుపత్రి దేవాలయం, రోగులే దేవుళ్లు అని భావించి వైద్యులు సేవలు అందిస్తున్నారన్నారు. రోగుల సహాయకులు, బంధువులు కూడా వైద్యులకు సహకరించాలని ఆయన కోరారు. రోగులు, వారి బంధువుల ఓర్పు, సహనం, వైద్యుల పనిని సులభతరం చేయడంతో పాటు రోగులు త్వరగా కోలుకొనేలా చేస్తుందని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. రోగుల సహాయకుల కోసం ఆసుపత్రిలో మధురాన్నం.. ఉచిత భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. శారదా పీఠం ద్వారా కూడా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జాగృతి సేవా సంస్థ ప్రతినిధి నాగరాజుకుమారి పండ్లు పంపిణీ చేశారు.

ఏఎన్‌యూ పురుషుల వాలీబాల్ జట్టు ఎంపిక



వర్సిటీ వాలీబాల్ జట్టుతో సెలెక్షన్ కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు మూడు రోజులుగా కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వర్సిటీ పురుషుల వాలీబాల్ జట్టుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆటతీరు, ఫిట్‌నెస్, నైపుణ్యాలను పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపారు. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కాలేజీ క్రీడాకారులు కల్యాణ్ కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, ఎం.మణికంఠరెడ్డి, జె నితిన్‌కుమార్, యూసీపీఈఎస్‌ఎస్‌కు చెందిన బి.మనోజ్, పి.శ్రీను, సీహెచ్ కోటి, వి.శంకర్, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి బి.విజయ్‌కుమార్‌రెడ్డి, డి.బాలరెడ్డి, ముప్పాళ్ళ ధనలక్ష్మి కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి ఎస్‌కే ఉస్మాన్, ఏపీఆర్‌డీసీ నుంచి కె.శేఖర్‌బాబు, నరసరావుపేట కేబీఆర్ డిగ్రీ కాలేజ్ నుంచి బి.వెంకటేష్, వేద ఫార్మసీ కాలేజ్ నుంచి వై.అశోక్‌బాబును ఎంపిక చేశారు. స్టాండ్ బైగా కృష్ణవేణి కళాశాల నుంచి వై.కుమార్, వర్సిటీ నుంచి ఎన్.సబీర్, సీహెచ్‌బీపీఎస్ నుంచి ఎస్‌డీ అబ్బాస్, ముప్పాళ్ల ధనలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి కె.భాను ప్రకాశ్‌లను ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ పి.గౌరి శంకర్, డాక్టర్ పి.శ్రీనివాస్, జె.ప్రేమ్ కుమార్, వర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ డి.సూర్యనారాయణ వ్యవహరించారు. డిసెంబరు 10 నుంచి 14వ తేదీ వరకు వరకు కాకినాడ జేఎన్‌టీయులో నిర్వహించే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో జట్టు పాల్గొంటొందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు తెలిపారు.

ముగ్గురు డీజిల్ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వీర ప్రసాద్

జంగారెడ్డిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):రాత్రి సమయాల్లో జాతీయ రహదారుల్లో నిలిపి ఉన్న లారీలలో డీజిల్ దొంగిలిస్తున్న పల్నాడు జిల్లాకు చెందిన ముదావత్ స్వామి నాయక్, ముదావత్ బాలకృష్ణ నాయక్, మురాతు శ్రీను నాయక్ అనే ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసినట్లు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఎస్సై ఎన్.వీర ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 27వ తేదీ గురువారం తెల్లవారు జామున బైపాస్ రోడ్డులోని లారీ కార్యాలయం వద్ద ఆపిఉన్న లారీలో డీజిల్ దొంగిలిస్తుండగా లారీ డ్రైవర్ అరవడంతో అతన్ని చాకుతో చంపుతామని బెదిరించి కారులో పారిపోయారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు. శుక్రవారం పట్టణ శివారులోని రామచర్లగూడెం సమీపంలో వాహ నాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి కారు వెనక్కి తిప్పి పారిపోతుండడంతో కారును అడ్డుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు డీజిల్ దొంగిలించే ముఠా అని తేలిందన్నారు. అనేక జిల్లాల్లోని జాతీయ రహదారుల్లో నిలిపి ఉన్న వాహనాల్లో డీజిల్ దొంగింలించినట్లు విచారణలో తేలిందని ఎస్సై తెలిపారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. వారి నుంచి టాటా ఇండిగో కారు, కారు డిక్కీలో ఉన్న 30 లీటర్ల డీజిల్‌తో ఉన్న డబ్బా, ఏడు ఖాళీ డబ్బాలు,డీజిల్ పైపు, బ్లేడు, చాకు స్వాధీనం చేసుకున్నారు.

శంకుస్థాపనలు చారిత్రాత్మక ఘటన

● ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో 15 బ్యాంకింగ్, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేయడం చారిత్రాత్మక ఘటన అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ కారణంగానే అమరావతిలో రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అమరావతిపై విమర్శించే నోళ్లకు కళ్లు తెరిపించే అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు. జగన్, వైసీపీ నేతలు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులకు అన్ని విధాలుగా ద్రోహం చేశారని, ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన రూ.1674 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. రైతుల నుంచి పంట కొనుగోలు చేసిన 24 గంటల్లో ధాన్యం కొనుగోలు డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. జగన్ రైతులకు తీవ్ర అన్యాయం చేసిన పంట బీమాను పునరుద్ధరించి రైతులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్చుకోలేకనే వైసీపీ కళ్లబొల్లి కబుర్లతో పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో నూతన విద్యా విధానం

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ద్వారా నూతన విద్యా విధానాన్ని అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం 2022లో సర్వ శిక్షా అభియాన్ నిధులు రూ.11 లక్షలతో వేమూరులో ప్రారంభించిన జేబీ పాఠశాల నూతన భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా వదిలి వేశారు. అక్టోబరు నెల 24న పర్యటించిన ఎమ్మెల్యే ఆనందబాబు పాఠశాల దుస్థితిని గుర్తించి నిలిచిపోయిన పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇచ్చిన గడువులోగా నిర్మాణం పనులు పూర్తి చేశారు. సంబంధించిన పాఠశాల భవనాన్ని శుక్రవారం ఆనందబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వ్యవస్థలతో పాటు విద్యా వ్యవస్థను నాశనం చేశారని దాని వల్ల సమాజం కూడా దెబ్బతినే వాతావరణం సంతరించుకుందని ఆవేదన వ్యక్తపరిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో విద్యావ్యాప్తి కోసం ప్రత్యేక దృష్టి పెట్టి అందుకు సంబంధించిన నిధులు కూడా పుష్కలంగా విడుదల చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, ఎంతఃవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

టెండర్లు ఖరారు!

(5వ పేజీ తరువాయి)

పైపులైన్‌లను నిర్మించనున్నారు. బుగ్గవాగు నుంచి మాచర్ల చెరువుకు నీటి తరలించేందుకు 27 కిలోమీటర్లు పైపు లైన్ ఏర్పాటు చేయనున్నారు. అయితే మాచర్ల పట్టణానికి సాగర్ నుంచి పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న వాటర్ గ్రిడ్ పైపు లైను నుంచి మాచర్ల చెరువుకు నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రతిపాదన చేశారు. ఐదు కిలోమీటర్లు పైపులైను నిర్మిస్తే చెరువుకు నీరు చేరుతుంది. బుగ్గవాగు నుంచి దూరం కావడంతో పాటు వ్యయం కూడా భారీగా పెరగనుంది. బుగ్గవాగు నుంచి మోటార్ల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంటుంది. వాటర్ గ్రిడ్ లైన్‌ను అనుసంధానం చేస్తే గ్రావిటీపై మాచర్ల చెరువుకు నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. జలజీవన్ మిషన్ కింద వాటర్ గ్రిడ్, యూఐడీఎఫ్ కింద మాచర్ల పైపులైన్ నిర్మాణం చేపడుతున్నారు. రెండు పథకాలను అనుసంధానం చేయాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు లభించాల్సి ఉండటంతో ఇది సాధ్యపడదనే అధికారుల వాదనతో బుగ్గవాగు నుంచి మాచర్లకు పైపులైన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్ కూడా ఖరారైంది.

మాచర్లకు రూ.109.34 కోట్లు

మాచర్లలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నీటి పథకం విస్తరణకు రూ.109.34 కోట్లు వెచ్చిస్తోంది. ప్రస్తుతం క్వారీ పిట్‌ను నీటి నిల్వ చెరువుగా వినియోగిస్తున్నారు. బుగ్గవాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా మాచర్లకు తాగు నీటిని తరలిస్తారు. మునిసిపాల్టీలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను చేపట్టారు. దీంతో పాటు పైపు లైన్లను కూడా నిర్మించనున్నారు. ఈ పనుల చేపట్టేందుకు టెండర్ ఖరారైంది.

పిడుగురాళ్లకు..

. కృష్ణా నది నుంచి పిడుగురాళ్లకు తాగునీటి తరలించేందుకు గతంలో పైపు లైన్ నిర్మించారు. అయితే ఈ పైపు లైన్‌పై తరచూ లీకులు ఏర్పడుతూ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఏడాది పొడవునా గ్రావిటీపై నీటిని తరలించేందుకు బుగ్గవాగు నుంచి పైపు లైన్ నిర్మిస్తారు. బుగ్గవాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేస్తారు. అక్కడే ఓహెచ్‌బీఆర్ నిర్మించి వాగు నుంచి నీటిని పంపు చేస్తారు. ఓహెచ్‌బీఆర్ నుంచి పైపు లైన్ ద్వారా గ్రావిటీపై పిడుగురాళ్లకు నీటిని తరలించే విధంగా పబ్లిక్ హెల్త్ శాఖ డిజైన్ చేసింది. 30 ఎంఎల్‌డీ నీటిని తరలించేందుకు 700 ఎంఎం సామర్థ్యం గల పైపులైన్‌ను నిర్మిస్తారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పిడుగురాళ్ల మునిసిపాల్టీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టింది. దీంతో పాటు పాటు డిస్ట్రిబూషన్ లైన్‌లు, 14 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంట్‌కు మరమ్మతులు చేస్తారు. రూ.177.67 కోట్ల వ్యవయంతో పనులు చేపడుతున్నారు.

గుంటూరుకు రూ.214.06 కోట్లు

గుంటూరు కార్పొరేషన్‌లో తాగు నీటి పథకం విస్తరణకు రూ.214.06 కోట్లు కేటాయించారు. కార్పొరేషన్‌లో విలీనం చేసిన 10 గ్రామాల ప్రాంతాలకు నీటి సరఫరా చేయనున్నారు. ఆయా ప్రాంతాలను కలుపుతూ ప్రధాన పైపు లైన్ నిర్మిస్తారు. దీనిని నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్‌లు ఏర్పాటుచేస్తారు. ఈ ప్రాంతాలకు సరఫరా చేసే నీటిని శుద్ధి చేసేందుకు 53 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించనున్నారు.

చిలుమూరులో

కొండచిలువ ప్రత్యక్షం



కొండచిలువ

కొల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొండచిలువను స్థానికులు కొట్టి చంపిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలో చిలుమూరు ఎస్‌సి కాలనీలో కొండ చిలువ కోళ్లను పట్టి తినబోతుండగా గమనించిన స్థానికులు కర్రలతో కొట్టి చంపారు. సుమారు 12 అడుగులు పొడవు ఉన్నట్లు చెబుతున్నారు. ఇటీవల కృష్ణానదికి వచ్చిన భారీ వరదలకు నీటి ప్రవాహంలో కొండచిలువలు కొట్టుకువచ్చాయి. వరద తగ్గిన అనంతరం కొల్లూరు కరకట్ట దిగువన అవులవారిపాలెం వెళ్లే రహదారిపై కొండ చిలువను లంక గ్రామాలకు వెళ్లే ప్రజలు గమనించిన కొంతమంది సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు.

యాప్‌ల భారం తగ్గించాలి: ఎస్టీయూ అధ్యక్షురాలు బేబీరాణి

రెంటచింతల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యాప్‌ల భారం తగ్గించాలని ఎస్టీయూ మండల అధ్యక్షురాలు బేబీ రాణి కోరారు. శుక్రవారం నిర్వహించిన ఎస్టీయూ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అప్పటికప్పుడు మేసేజ్ పెట్టి అర్జంట్ అని చెప్పడం వలన టీచర్లు ఒత్తిడికి గురౌతున్నారన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, లేళ్ల శ్రీనివాసరావు, అమలబాబు, ఖుద్దుస్, వెంకటేశ్వర్లు, భీముడునాయక్, శ్రీనునాయక్, అక్కారావు, అహ్మద్, హేమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశం

మాచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం...

దాచేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం శనివారం సచివాలయం-1లో జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మునిసిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

పిడుగురాళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోని ఈ-చాంప్స్ విద్యార్థులు శుక్రవారం కొండమోడులోని అనాధ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. విద్యార్థుల పాకెట్ మనీతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపాల్ గండికోట అనంత కోటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఏజీఎం వీ జానకి రామిరెడ్డి, కో-ఆర్డినేటర్ భద్రారెడ్డి, ఆర్‌ఐ హుస్సేన్, గౌసియా, రిహాని, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

నకరికల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్లేట్లు అందించటం అభినందనీయమని హెచ్‌ఎం షేక్ పాహీం అన్నారు. శుక్రవారం చేజర్లలోని ఎస్‌వీఎస్‌ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు చేజర్ల గ్రామానికి చెందిన ఉన్న వెంకటేశ్వర్లు ప్లేట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీ ప్రసాదు, గేరా మోహన్‌రావు, వై సుబ్బారావు, షేక్ గౌస్, బీ వెంకటరెడ్డి, బీ నాగమణి, పిల్లి మెర్సి పాల్గొన్నారు.

సాగర్‌బాబు కుటుంబసభ్యులకు న్యాయం చేయాలి

నకరికల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వికలాంగుడిగా మారిన వర్ల సాగర్‌బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. చేజర్లలో వర్ల సాగర్‌బాబు నిరవధిక దీక్షలు శుక్రవారంతో 77వ రోజుకు చేరాయి. జిల్లా అధికారులు సాగర్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. శిబిరానికి మద్దతుగా వీ కోటానాయక్, పీడీఎం నేత వై వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్ వలి, రెడ్డిబోయిన ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నరాల వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30వ తేదీన స్థానిక యోగాశ్రమం ఆధ్వర్యంలో నరాల వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం జరుగుతుంది. విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు చెందిన న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి శిబిరంలో వైద్యపరీక్షలు చేయనున్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే వైద్యశిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి 5 సెంట్ల స్థలం వితరణ

రెంటచింతల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి గౌరి అమరనాగేశ్వరరావు 5 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చినట్లు టీడీపీ నేతలు కోరే నాగేశ్వరరావు, కోటేశ్వరరావులు చెప్పారు. ఈ స్థలంలో రూ.40లక్షలతో 60వేల లీటర్ల సామర్థ్యంగల ట్యాంక్ నిర్మిస్తారన్నారు.

వృద్ధాశ్రమంలో నిత్యావసరాల పంపిణీ

గురజాలటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ శ్రీకారం చేసినప్పటి నుంచి మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన టీడీపీ అభిమాని కావూరి రామారావు పట్టణంలోని ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో చేయూత అనే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో వృద్ధులకు 18 నెలలుగా బియ్యం, పండ్లు, కూరగాయలు, వంట నూనె తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు జానకి రామ్, చింతకాయల యేసయ్య పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు సన్మానం

మాచర్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫోటో పత్రిక ఎడిటర్, సీనియర్ ఫోటో జర్నలిస్ట్ పుట్ల నాగేశ్వరరావు జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు (ఒడిశా) భువనేశ్వర్‌లో జాతీయస్థాయిలో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ కార్యాలయంలో నాగేశ్వరరావును దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 204ఏ వైస్ గవర్నర్ మేడం నాగేశ్వరరావు, క్లబ్ రీజియన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, తిరివీధుల వెంకట నాగేశ్వరరావు, పందిరి శ్రీనివాసరావు, బచ్చు రాజ్‌కుమార్, పందిరి నరసింహారావు, బత్తుల వీర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా పనిచేస్తే సహించేది లేదు

● అధికారులకు ఎమ్మెల్యే ప్రవీణ్ హెచ్చరిక



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రవీణ్

బెల్లంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల, గ్రామస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా పనిచేస్తే ఊరుకొనేది లేదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వన్నాయపాలెంలో ప్రజల వద్దకు ప్రవీణ్ వందరోజులు.. వంద గ్రామాల కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు పని చేయాలన్న సంకల్పంతో ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని సూచించారు. ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలన్నారు. తొలుత ఎమ్మెల్యే ప్రవీణ్‌కు గ్రామస్తులు, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయం వద్ద గ్రామసభను ఏర్పాటుచేసి ప్రజల సమస్యలను స్వయంగా విని తక్షణమే పరిష్కరించేలా అధికారులతో చర్చించారు. అధికారులు రైతులను ఇబ్బంది పెట్టకుండా వారికి సమాధానం చెప్పాలని సూచించారు. చాలామంది రైతులు రెవెన్యూ, పంచాయతీ, సర్వేయర్లు సక్రమంగా పనిచేయటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. కూటమి ప్రభుత్వం నిరుపేదలను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. వన్నాయపాలెం గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఇరువురు దివ్యాంగులను ట్రైసైకిళ్ళు తన కార్యాలయానికి వచ్చి తీసుకువెళ్ళాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో అనిత, వెన్నా సీతారామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు అక్కల వెంకట రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, ఓర్సు ఆనంద్, ఆసుల జగన్, సర్పంచ్ వెంకటస్వామి, టీడీపీ నాయకులు సురేష్, వాసు, రసూల్, శంకర్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, చిన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

పెదకూరపాడు: రెండో విడత భూసేకరణలో భాగంగా పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి మండలంలోని నాలుగు గ్రామాలలో ల్యాండ్ పూలింగుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడి గ్రామాల నుండి సుమారు 7500 ఎకరాలలో భూసేకరణ చేయనున్నట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికే వారం వారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను అందించారు. గృహ, పెన్షన్, వైద్యం తదితర సమస్యలపై ప్రజలు కన్నాకు వినతిపత్రాలు అందించారు. వెంటనే పరిష్కరించాలని కన్నా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఉన్నారు.

నియామక పత్రాలు అందజేత

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో 17మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం టీడీపీ ప్రజావేదికలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, మస్తాన్‌వలి, బత్తుల నాగేశ్వరరావు, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, ఆళ్ళ అమరేశ్వరరావు, జాన్‌బాబు, చౌట శ్రీనివాసరావు, అంచుల నరసింహారావు, దరువూరి నాగేశ్వరరావు, మన్నవ శారదాదేవి, కూటమి నేతలు పాల్గొన్నారు.

ముఖ్య నేతలతో సమావేశం

పట్టణంలోని 4వ వార్డు కూటమి ముఖ్య నేతలతో, సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు కూడా పారదర్శకంగా పని చేస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

పూలేకు ఘన నివాళులు

సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై



అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామకపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నాగోతు శౌరయ్య తదితరులు

పోరాటం చేసి మహిళలకు విద్యాభివృద్ధి కల్పించిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం కన్నా కార్యాలయంలో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, నూర్ బాషా జాన్ బాబు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకి ఘన నివాళులు



పిడుగురాళ్లలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూటమి నేతలు

పిడుగురాళ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం కూటమి నేతలు నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావుపూలే సామాజిక సంస్కరణలు, విద్యారంగానికి, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు చేసిన కృషిని కూటమి నేతలు కొనియాడారు. కార్యక్రమంలో పిల్లి చెన్నారావు, తురకా వీరస్వామి, వల్లెపు రామకృష్ణ, కొమెర రామచంద్రరావు, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, ఎల్‌వీఆర్, కుంచపు గంగరాజు, మేకల ఆంజనేయులు, వేముల ఆంజనేయులు, షేక్ సైదా, జెమిని రామకృష్ణ, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, సుతారు మల్లేశ్వరరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు కుక్కమూడి ప్రసాద్, పేరుపోగు జార్జి, గురజాల అప్పారావు, బొడ్డుపల్లి ఈశ్వరయ్య, పరిమళ రామాజారావు, కడియం శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రామికుల కోసం రాత్రి బడిని ఏర్పాటు చేసి ప్రజల్లో ఆత్మస్థయిర్యం నింపిన మహాత్మాజ్యోతిరావుపూలే దీనజన బంధువుగా గుర్తింపు పొందారని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మోహన్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఎస్.శ్రీనివాసరావు టీచర్లు ,విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరంలో ఫ్రైడే డ్రైడే

మాచర్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రాయవరం గ్రామంలో శుక్రవారం మాచర్ల మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య ఆధ్వర్యాన ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. నిల్వ ఉన్న నీటి కుంటలలో ఆయిల్ బాల్స్ వేశారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వ్యాధులు వస్తాయని, అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళీధర్, హెచ్‌వో భూలక్ష్మి, ఏఎన్‌ఎం ప్రసన్న, జయ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నీటి కుంటలో ఆయిల్ బాల్స్ వేస్తున్న మలేరియా అధికారులు

బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు

రాజస్థాన్ ఎమ్మెల్యే శిఖా బరాలా

మాచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు రాజస్థాన్ ఎమ్మెల్యే శిఖా బరాలా అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడి మార్పుపై పార్టీ నేతల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతల అభిప్రాయాలను అధిష్టానానికి అందిస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడుతుంది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కార్యక్రమంలో సహ పరిశీలకులు తోట శివనాగేశ్వరరావు, ఖుర్శిదా, జిల్లా అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి, వంగపాటి నాగరాజు, గాదె పుల్లారెడ్డి, చిమటా వెంకటేశ్వర్లు, దొడ్డా శ్రీనివాసరావు, షేక్ నాసర్‌వలి, సంకూరి రామారావు మాష్టారు తదితరులు పాల్గొన్నారు.



నేతల అభిప్రాయాలను సేకరిస్తున్న రాజస్థాన్ ఎమ్మెల్యే శిఖా బరాలా

ఆర్డీఎస్ఎస్ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా

● ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్య



రెంటచింతల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్డీఎస్ఎస్ పనులను పరిశీలిస్తున్న ఏపీసీపీడీసీఎల్ ఈఈ సింగయ్య

రెంటచింతల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 24 గంటలు కోతల్లేని నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రెంటచింతలలో రూ.3.35 కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయని ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్య చెప్పారు. శుక్రవారం రెంటచింతల సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెంటాలలో 4, పశర్లపాడు 6, మిట్టగుడిపాడు 4, రెంటచింతలలో 8 నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జనవరి 20 కల్లా పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవడానికి డిసెంబర్ 31 వరకు అవకాశం ఉందన్నారు. ట్రూడౌన్ చార్జీల తొలగింపుతో వినియోగదారులకు ఎంతో ఊరటకలిగిందన్నారు. సమావేశంలో ఏఈ మస్తాన్‌వలి, ఎన్‌సీసీ ప్రతినిధి సీపీ బాబయ్య, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు

క్రోసూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దొడ్లేరు, ఆవులవారిపాలెం, అందుకూరు గ్రామాల్లో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల కోసం సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో ఒక్కొక్కరికి రూ.14వేలు అందజేశారన్నారు. మార్కెటింగ్ వసతులు, మద్దతు ధర, పంటలను కొనుగోలు చేయటం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయం విషయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వ్యవసాయాన్ని వాతావరణ ఆధారంగా వేసుకోవాలని, ఎప్పటికప్పుడు రైతులు కూడా పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని తెలిపారు. ఆయన వెంట ఆర్ఎస్‌కే సిబ్బంది, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్, తాళ్ళూరి శ్రీనివాసరావు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏపూరి నాగేశ్వరరావు, సిబ్బంది

మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణకు సూచనలు

నకరికల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు కన్పిస్తుందని, దీని నివారణకు క్లోరంతర నీలిప్రోల్ 60ఎంఎల్ ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలని జిల్లా ఏరువా కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, డాక్టర్ సత్యగోపాల్‌లు సూచించారు. శుక్రవారం కుంకలగుంటలోని మొక్కజొన్న పైరును పరిశీలించారు. కత్తెరపురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 25 నుంచి 35 రోజుల లోపు ఎకరాకు మూడు కిలోల కార్బో ప్యూరాన్ 3జీ గుళికలను మొక్కల సుడుల్లో రెండు నుంచి మూడు గుళికలను వేయాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న చివరి దుక్కిలో ఎకరాకు భాస్వరం ఎరువు డీఏపీ రూపంలో ఐతే 75 కిలోలు, లేదా సింగిల్ సూపర్ పాస్పేట్ ఐతే 200 కిలోలు, యూరియా ఒక బస్తాతో పాటు ఎంవోపీ 30 కిలోలు దుక్కిలో వేయాలని సూచించారు. పైపాటుగా నానో యూరియాను వాడాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ బీ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో కే దేవదాసు, ఏఈలు ఎన్ విజయలక్ష్మి, బీ రవి పాల్గొన్నారు.



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, డాక్టర్ సత్య గోపాల్

తాడువాయిలో రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం

అచ్చంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్, బూత్ పరిశీలకులు కోమటినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తాడువాయి గ్రామంలో రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను వినియోగించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానాలను అనుసరించాలని కోరారు. అనంతరం 32, 33, 34, 35, 37 బూత్‌ల నాయకులను పిలిచి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్ నాయక్, మూడావత్ బాలూ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్, అనుమోలు వెంకటేశ్వరరావు, పాశం సుబ్బారావు, కమతం వెంకటేశ్వర్లు, ఎక్కిరాల డేవిడ్ రాజు, ఏపూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తాడువాయి కార్యక్రమంలో కోమటినేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు

గ్రామాలలో ప్రశాంతంగా ఉండాలి

● డీఎస్పీ హనుమంతరావు



తొండపిలో గడ్డివాములను జల్లెడ పడుతున్న పోలీసులు

ముప్పాళ్ళ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రజలు ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. మండలంలోని తొండపి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు గ్రామాన్ని జల్లెడపట్టారు. 100మంది పోలీసులు 9 బృందాలుగా ఏర్పడి, సరైన పత్రాలు లేని 31 ద్విచక్రవాహనాలు, ఒక కారు, ఒక ఆటో, ఒక గొడ్డలి, 7 కర్రలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ అనుమానితులు, పాత కేసులలోని నిందితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పాత కేసుల నిందితులతో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ పిల్లల్ని జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలని అన్నారు, సెల్ ఫోన్లుకి, డ్రగ్స్‌కి బానిసలుగా మారకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సీఐ పి.కిరణ్, టౌన్ సీఐ ఎన్.నాగమల్లేశ్వరరావు, అమరావతి సీఐ వై.అచ్చయ్య, పెదకూరపాడు సర్కిల్ సీఐ సురేష్, ముప్పాళ్ళ ఎస్సై పి.అనిల్‌కుమార్, రాజుపాలెం ఎస్సై మణికృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి మృతి బాధాకరం: ఎమ్మెల్యే ప్రవీణ్



శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్ తదితరులు

బెల్లంకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి సోదరుడు వెన్నా శ్రీనివాసరెడ్డి మృతి బాధాకరమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం ఆయన నాగిరెడ్డిపాలెంలో శ్రీనివాసరెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అక్కల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర మైనర్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, బద్దూరి సుబ్బారెడ్డి, పీఎస్‌కే రసూల్, డీలర్ సుభానీ, వీరారెడ్డి, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్

దాచేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా మందా రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం దాచేపల్లిలో జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా సుంకర మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా పంచకట్ల కిషోర్, ఆర్థిక కార్యదర్శిగా దేవరపు చక్రధర్ ఎన్నికయ్యారు. దాచేపల్లి మండల శాఖ వార్షిక కౌన్సిల్ సమావేశం బీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధులుగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, పిడుగురాళ్ళ ఏరియా కార్యదర్శి కే రామలింగయ్య, ఎస్‌వీ రమణారావు పాల్గొన్నారు. ఎన్నికల పరిశీలన అధికారిగా ఆర్ వెంకటరెడ్డి వ్యవహరించారు. సమావేశానికి గురజాల, పిడుగురాళ్ళ ఎస్టీయూ నాయకులు హాజరయ్యారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

పెదకూరపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేస్తామని ఎస్ఐ జి.గిరిబాబు అన్నారు. పెదకూరపాడులో శుక్రవారం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగిన వ్యక్తులు రూ.10,500 అపరాధరుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. డబ్బులు చెల్లించకపోతే జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. ప్రమాదాలు జరిగితే కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుందన్నారు.

● నకరికల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కే సతీష్ వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం రాత్రి నకరికల్లు, అడ్డరోడ్డు ప్రధాన కూడళ్ళ వద్ద వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. రాంగ్ రూట్‌లో రావటం వల్ల వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయటంతో పాటు భారీగా అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు.

పదిమందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

దాచేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి ఎసీఐ భాస్కరరావు పర్యవేక్షణలో శుక్రవారం ఎస్ఐ పాపారావు దాచేపల్లిలోని ప్రధాన సెంటర్‌లో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో పదిమందికిపైగా మద్యాన్ని సేవించి వాహనాలు నడపటాన్ని అధికారులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నారు.

వాహనాల తనిఖీ

దుర్గి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో శుక్రవారం ఎస్ఐ సుధీర్‌కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. పాత చలానాలుంటే చెల్లించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దుర్గి: వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ సుధీర్‌కుమార్

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

వెల్దుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడులో గల ఎంపీపీఎస్ బీసీ పాఠశాలను శుక్రవారం ఎంఈవో ఎండీ ఖాసీం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మెగా డీఎస్సీ 2025 ద్వారా వచ్చిన నూతన ఉపాధ్యాయులందరూ పాఠశాలలో విద్యార్థుల హాజరునమోదును పెంచాలని, పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా కృషి చేయాలని అన్నారు. గిరిజన బాలికల పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ టెస్ట్‌ను పరిశీలించారు.

రాష్ట్ర భట్రాజు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన సరికొండ వెంకటేశ్వరరాజు శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా కలసి జ్ఞాపికను అందించారు. అనంతరం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కూడా సరికొండ వెంకటేశ్వరరాజు పార్టీ కేంద్ర కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

- సత్తెనపల్లి





విత్తనాభివృద్ధిలో వినూత్న ఒరవడి

● పాడి నుంచి పంటల సాగుపై దృష్టిసారించిన సంగం డెయిరీ.. ● నూతన ఆవిష్కరణలతో మార్కెట్‌లోకి విత్తనాలు..

పొన్నూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా వెలుగొందుతున్న సంగం డెయిరీ.. విత్తనాభివృద్ధిపై దృష్టిసారించింది. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార దిశగా పరిశోధనలు మొదలు పెట్టింది. రైతులకు అవసరమైన, అధిక దిగుబడులిచ్చే.. చీడపీడలు సమర్థంగా తట్టుకునే విత్తనాలను అభివృద్ధి చేస్తూ.. మార్కెట్‌లోకి ప్రవేశ పెడుతోంది. సాగును లాభసాటిగా మార్చే ప్రక్రియలో.. సంగం సీడ్ ప్రాజెక్టును చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ 2021లో ప్రారంభించి.. అనతి కాలంలోనే అనేక పరిశోధనలతో వరి, అపరాల విత్తనాల్లో మేలైన రకాలను రైతులకు అందజేస్తున్నారు. విత్తన రంగంలో జీవితకాలం వివిధ ప్రయోగాలు, పరిశోధనలు జరిపి విజయవంతమైన ప్రముఖ విత్తన శాస్త్రవేత్త డాక్టర్ ఆలపాటి సత్యనారాయణను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఈ ప్రాజెక్టుకు నియమించారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆశయాలకు అనుగుణంగా డాక్టర్ సత్యనారాయణ వరి, మినుము, పెసర, చిక్కుడు, టమోటో, బెండ వంటి హైబ్రీడ్ విత్తనాలను అభివృద్ధి చేసి రైతులకు అందించడం ప్రారంభించారు. 53 ఏళ్ల అనుభవంలో ఆయన ఇప్పటి వరకు 109 రకాల విత్తనాలను అభివృద్ధి చేశారు.

అపరాల అభివృద్ధి

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీలో రెండవ పంటగా అపరాల పంటలైన మినుము, పెసర పైర్లను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. సంగం సీడ్ ప్రాజెక్ట్‌లో మినుము, పెసర విత్తనాలను సైతం అభివృద్ధి చేశారు. రైతులు ఎక్కువగా కోరుకునే పాలిష్ రకం మినుములు, ఎస్ఎస్‌బీ-2 అలాగే సాధా రకం ఎస్ఎస్‌బీ-1 అభివృద్ధి చేసి రైతులకు అందిస్తున్నారు. ఈ రకం మినుము పల్లాకు తెగులను సమర్థంగా తట్టుకొనే ప్రత్యేక రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటుంది. గతేడాది ఎస్ఎస్‌బీ-2 రకం సాగు చేసిన రైతులు అత్యధికంగా 13.25 క్వింటాళ్ల దిగుబడి పొందారు. పెసర విత్తనాలు ఎస్ఎస్‌జీ-3 బీమ్ రకం అభివృద్ధి చేశారు. ఈ రకం గింజ లావుగాను, అధిక బరువుతో దిగుబడి ఇచ్చే విధంగా అభివృద్ధి చేశారు. ఈ విత్తనాలను సాగు చేసేందుకు రైతులు అసక్తి చూపుతున్నారు. చిక్కుడు సాగు చేసే రైతుల కోసం ఎస్ఎస్‌డీబీ-1 చెట్టు చిక్కుడు రకాన్ని అభివృద్ధి చేశారు. మిరప, బెండ, మొక్కజొన్న వంటి అనేక రకాల కూరగాయలు విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంగం సీడ్స్ ప్రాజెక్టు నిరంతరం పనిచేస్తుంది.

రుద్ర టమోటాకు డిమాండ్



సంగం సీడ్ ప్రాజెక్టు రూపొందించిన రుద్ర టమోటా హైబ్రీడ్ విత్తనాలకు అత్యధిక డిమాండ్ ఉంది. చిత్తూరు, మదనపల్లి, కుప్పం వంటి ప్రాంతాల్లోనే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోనూ టమోటాను అధికంగా పండిస్తారు. రుద్ర టమోటా విత్తనం చీడపీడలను తట్టుకొని, అత్యధిక రోజులు నిల్వ ఉండే సామర్థ్యంతో.. ఆకర్షణీయమైన రంగుతో అధిక దిగుబడులు ఇస్తుండటంతో డిమాండ్ ఉంది. గతేడాది టమోటా పంటను కాయ కుళ్లు తెలుగుల ఆశించి రైతులను నష్టపరిస్తే.. రుద్ర పంట మాత్రం తెగుళ్ల సమర్థంగా తట్టుకుంది. రైతులకు అధిక దిగుబడులు ఇచ్చి లాభాలను చూపింది. ఎకరాకు 80 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. చిత్తూరు జిల్లాతో పాటు రాయలసీమ ప్రాంతంలో కూడా ఈ రకం అధికంగా సాగవుతోంది.

రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యం



రైతులు పాడి పరిశ్రమతో పాటు వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించే లక్ష్యంతో నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంగం సీడ్ ప్రాజెక్టును ప్రారంభించాం. అనతి కాలంలోనే రైతుల ఆదరాభిమానాలు చూరగొనడం హర్షణీయం.

- ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, చైర్మన్ సంగం డెయిరీ

అధిక దిగుబుడులు



చీడపీడలు తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను అందించడమే సంగం సీడ్ ప్రాజెక్టు లక్ష్యం. విత్తన రంగంలో 53 ఏళ్ల అనుభవంతో రైతులకు లాభాలు ఇచ్చే విత్తనాలను అందిస్తున్నాం. ఇప్పటికే డెల్టా ప్రాంతంలో సంగం సీడ్ ప్రాజెక్టు రూపొందించిన వరి విత్తనాలు రైతుల ఆదరాభిమానాలు పొందుతున్నాయి. ఇటీవల తుపానును సైతం తట్టుకొని.. అధిక దిగుబడులు ఇచ్చే అవకాశం ఉంది.

- డాక్టర్ సత్యనారాయణ, శాస్త్రవేత్త

వరిలో దిగుబడి విప్లవం



సంగం సీడ్ ప్రాజెక్టు రూపొందించిన ఎస్ఎస్ఆర్-2, ఎస్ఎస్ఆర్-4 వరి విత్తనాలు రైతుల మన్ననలు పొందుతున్నాయి. ఎస్ఎస్ఆర్-2 రకం పంట 135 రోజుల్లో చేతికి వస్తుంది. కంకి పెద్దదిగాను, గింజ నాణ్యతతోను, బీపీటీలను పోలి ఉంటుంది. అంతేకాకుండా చీడపీడలను, పురుగులను సమర్థంగా తట్టుకొని రైతులకు తక్కువ పెట్టుబడితో పంట చేతికి వస్తుంది. ఈ రకం ధాన్యంలో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్న వారు కూడా తినవచ్చు.

● ఎస్ఎస్ఆర్-4 రకం పంట 140 రోజుల వ్యవధిలో చేతికి వస్తుంది. కంకి పెద్దదిగాను, దృఢమైన పిలకలు, దుబ్బుతో ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకొని నిలబడుతుంది. కింకిలో 400 గింజలు ఏర్పడటం దీని ప్రత్యేకత. ఒక్కో దుబ్బులో 25 పిలకలు ఉండి.. అధిక దిగుబడి వచ్చేలా ఈ విత్తనం అభివృద్ధి చేశారు. డెల్టా ప్రాంతంలో ఈ రెండు రకాల వరి విత్తనాలను రైతులు సాగు చేసి.. ఈ ఏడాది ఖరీఫ్‌లో 45 నుంచి 50 బస్తాల దిగుబడి సాధిస్తామని చెబుతున్నారు.

‘బర్లీ’.. బంద్

(5వ పేజీ తరువాయి)

పొగాకు కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ చేపట్టినప్పుడు రైతుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ అంకం ముగింపుకొచ్చేసరికి సేకరణ ప్రక్రియపై బర్లీ రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పెండింగ్ బకాయిలతో సహా నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం రూ.150 కోట్ల వరకు బర్లీ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. బకాయి ఉన్న రూ.38 కోట్లను గురువారం బర్లీ రైతుల ఖాతాల్లో జమ చేశామని, బర్లీ పొగాకు కొనుగోళ్లలో మార్క్‌ఫెడ్ పాత్ర దాదాపుగా ముగిసిందనే స్పష్టతను అధికారులు ఇచ్చారు.

గిడ్డంగుల ఖాళీపై దృష్టి..

ఖరీఫ్ ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వస్తుండడంతో గోడౌన్లలో నిల్వ ఉన్న బర్లీ పొగాకును ఖాళీ చేయించడంపై మార్క్‌ఫెడ్ దృష్టి పెట్టింది. నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న ఏఎంసీ గోడౌన్‌లతో పాటు వేర్‌హౌసింగ్ గోదాములను కూడా బర్లీ నిల్వల కోసం మార్క్‌ఫెడ్ తీసుకున్న విషయం తెలిసిందే. బాపట్ల జిల్లాలో 66 ఏఎంసీ గోదాములు ఉండగా, 18 చోట్ల బర్లీ నిల్వలే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 12 చోట్ల బర్లీ నిల్వలను ఉంచారు. ధాన్యం దిగుబడులు మరో వారం రోజుల్లో ఊపందుకోనున్నాయి. ఆ సమయానికే గోడౌన్‌లను ఖాళీ చేయించడంపై యంత్రాంగం దృష్టి సారించింది. బర్లీ పొగాకును ప్రాసెసింగ్ ప్రక్రియ కోసం టెండర్లను ఆహ్వానించాలనే నిర్ణయానికి మార్క్‌ఫెడ్ వచ్చింది.

మూఢం..శుభకార్యాలకు విరామం

(5వ పేజీ తరువాయి)

మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈసారి మూఢంలోనే కలిసిపోతాయి.

మూఢం అంటే

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి.. వాడుక భాషలో మూఢమి(చీకటి) అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడుతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

వ్యాపారులపై ప్రభావం

శుభకార్యాలు లేకపోతే.. వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దె కార్లు, బస్సులు, సన్నాయి మేళం ఇలా సంబంధిత వర్గాలు నెలల కొద్ది నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 581.60 అడుగులు ఉంది. ఇది 287.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3972 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 15,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కార్తికం తర్వాత తగ్గిన బంతిపూల కాంతి

● కేజీ రూ.70 నుంచి రూ.30కి ధర పతనం
● లాభాలు లేవంటున్న రైతులు



నరసరావుపేట మండలం ఇసప్పాలెం గ్రామంలో బంతిపూలతోట

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): కార్తిక మాసం కాంతులు తగ్గగానే మార్కెట్లో రోజుకో రకంగా బంతిపూల ధర మారిపోతూ వస్తోంది. కార్తిక మాసంలో కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.40 కంటే ఎక్కువ ధర పలకడం లేదు. కార్తికం తర్వాత కాంతినివ్వని బంతిపూల కారణంగా రైతు మోమున కళ తప్పింది. నరసరావుపేట మండలంలోని ఇసప్పాలెం, నరసరావుపేట, గురవాయపాలెం, ములకలూరు, అగ్రహారం, జొన్నలగడ్డ తదితర గ్రామాల్లో పలువురు రైతులు బంతిపూల సాగు చేశారు. వాణిజ్య పంటల్లో స్తోమతకు మించి పెట్టుబడులు పెట్టి ఇబ్బంది పడేకన్నా.. పూల సాగులో తక్కువ పెట్టుబడితో ఎంతైనా పర్వా లేదు లాభం దక్కుతుందనే ఆశ పలువురు రైతులను బంతిసాగు వైపునకు మళ్లించింది. పెట్టుబడి తక్కువే అయినా తీరా అమ్మకం మొదలయ్యాక ధరల హెచ్చు తగ్గుల కారణంగా ఆశించిన ఫలితం రాదని పలువురు రైతులు చెప్తుతున్నారు. కార్తిక మాసంలో క్వింటాల్ రూ.6 వేల వరకు వెళ్లినా రూ.5 వేలకు తగ్గకుండా బంతి అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం కొంత మంది అయ్యప్పలు దీక్ష విరమణకు శబరిమలకు తరలి వెళ్లడంతో బంతిపూలకు కొంతమేర డిమాండ్ తగ్గింది. ఇసప్పాలెం గ్రామానికి చెందిన ఒక రైతు కేవలం 50 సెంట్ల పొలంలో బంతిసాగు చేసి 5 టన్నుల పూలు అమ్మినట్లు చెప్తున్నారు. కార్తీకం తరువాత పూసిన పూలకు మాత్రం ఇప్పుడు క్వింటా రూ.3 వేలకు (కిలో రూ.30) దిగజారిపోయింది. బంతి సాగులో ధరల దోబూచులాట కారణంగా ఆశించిన లాభాలు రావడం లేదని రైతులు చర్చించుకుం టున్నారు.

అర ఎకరాలో బంతి సాగు



కొన్నేళ్లుగా వాణిజ్య పంటలకు స్వస్తి పలికి బంతిపూల తోటను అర ఎకరం పొలంలో సాగు చేశాను. ఇప్పవరకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. నెల రోజులుగా బంతిపూలు కోతకు వస్తున్నాయి. ఇప్పటి వరకు పెట్టుబడి వచ్చేసింది. మరో నెల రోజుల పాటు పూలు కోతకు వస్తాయి. ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. కేజీ పూల కోతకు రూ.10 కూలి అవుతోంది.

- అల్లూరి కోటేశ్వరరావు, రైతు

ఎస్సీ లంక భూముల రైతులకు రిజిస్ట్రేషన్లు

తుళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా బోరుపాలెం, రాయపూడి పెద లంక, పూర్ణయ లంక, ఉద్దండ్రాయునిపాలెం, వెంకటపాలెం, మందడం లంక భూములకు సంబంధించిన అసైన్డ్ ల్యాండ్ భూములకు కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ల పక్రియ ప్రారంభమయినట్టు మంత్రి నారాయణ చెప్పారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో లంక అసైన్డ్ ల్యాండ్‌ను పెండింగ్‌లో పెట్టారని దానిని కూటమి ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. లంక భూముల సమస్యలను పరిష్కరించమని రైతులు కోరిన మీదట సీఎం ప్రత్యేక దృష్టి సారించటంతో విషయం కొలిక్కి వచ్చిందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

ఆర్థిక నగరానికి.. అంకురార్పణ

(5వ పేజీ తరువాయి)

ప్రాంతీయ బ్యాంకు కార్యాలయాల శిలాఫలకాలు, 2 ఇన్సూరెన్స్ సంస్థల శిలాఫలకాలను ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత రాయపూడిలో ఇటీవల ప్రారంభించిన ఏపీసీఆర్డీఏ కార్యాలయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు ఉన్నతాధికారులతో కలిసి ఆమె సీఆర్డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తొలి పైలాన్‌ను ఆమె ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు మరో పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంకు అధికారులు అక్కడ నిర్మించబోయే భవనాల నమూనాలను వారికి వివరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, పొంగూరి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మంత్రి పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజులు వరుసగా మిగిలిన పైలాన్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో కేంద్ర ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ప్రసంగించారు.

రైతులకు అండగా నిలవాలి : చంద్రబాబు

బ్యాంకులు కిసాన్ క్రెడిట్ రుణాలు ఇస్తే చాలదని, భూములిచ్చిన రైతుల త్యాగాలను గుర్తించి తగు రీతిలో వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి కోరారు. ఐదేళ్ల తమకు అన్ని విధాలా తోడ్పాటు ఇవ్వాలని, ఆ తర్వాత దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన భూమిక పోషిస్తామని నిర్మలా సీతారామన్‌ను కోరారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణానికి, అమరావతి అభివృద్ధికి అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తున్న కేంద్రం బ్యాంకు స్ట్రీట్ నిర్మాణంతో ఆర్థిక ప్రగతికి పునాదులు పడ్డాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, సీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే పూర్తయినా.. పాట్లు తప్పడం లేదు!

● సుమోటో కరెక్షన్స్‌లో నెలల తరబడి జాప్యం ● తహసీల్దార్ల ప్రతిపాదనలు ● కలెక్టరేట్‌లో నో క్లియరెన్స్
● లాక్ అవుతున్న ఎల్‌పీ నంబర్లు ● అడంగల్‌కు దరఖాస్తు చేసుకోలేక రైతుల ఇబ్బందులు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూముల రీ-సర్వే పూర్తి అయిన గ్రామాల్లో సుమోటో కరెక్షన్స్(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) జరగడం లేదు. దీని వలన రైతులు అనేక సమస్యలను జిల్లాలో ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భూమి లే అవుట్ పర్మిషన్(ఎల్‌పీ) నంబరు మీ భూమి ఆన్‌లైన్ పోర్టల్‌లో లాక్ అయి ఉంటోంది. ఈ కారణంగా అడంగల్ కోసం కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేని దుస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని సంబంధిత రైతులు పలుమార్లు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి సమస్యని పరిష్కరించడంలో జాప్యం జరుగుతోంది. గత కొన్ని నెలల నుంచి రెవెన్యూకి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష జరగకపోవడంతో ఇలాంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో సంతృప్తి శాతం తెలుసుకొనేందుకు ప్రభుత్వం నిర్వహిస్తోన్న ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌లో రైతులు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు.

సర్వే తీరు ఇలా..

జిల్లాలోని 17 మండలాల్లో నెట్ ఏరియా 1882.05 చదరపు కిలోమీటర్లు ఉంది. మొత్తం 212 గ్రామాలకు గాను, 62 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. 101 గ్రామాల్లో సర్వే కొనసాగుతుండగా 49 గ్రామాల్లో అసలు సర్వేనే ప్రారంభించ లేదు. అర్బన్, అటవీ భూముల్లో రీ-సర్వే మొదలు కాలేదు. ఏ ఒక్క మండలంలోనూ అన్ని గ్రామాల సర్వేని పూర్తి చేయలేదు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో నైసర్గిక విస్తీర్ణం ప్రకారం ఫైనల్ ఆర్‌వోఆర్‌ని కూడా ప్రకటించారు. అయితే చాలా గ్రామాల్లో డీఎల్ఆర్, నైసర్గిక విస్తీర్ణాలతో ఎల్‌పీ నంబర్ల విస్తీర్ణం మధ్య వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు పెదనందిపాడు మండలంలోని అనప్పర్రు గ్రామమే తీసుకొంటే మొత్తం 25 ఎల్‌పీ నంబర్లలో ఈ వ్యత్యాసం కనిపించింది. ఎస్ఎఫ్ఈ(షేప్ ఫైల్ ఎక్స్‌టెంట్), డీఎల్ఆర్, ఫైనల్ ఆర్‌వోఆర్ విస్తీర్ణాలు ఒకలా ఉంటే భూనక్ష ఎల్‌పీఎం విస్తీర్ణం మరోలా ఉంది. దీని వల్ల రైతులు అడంగల్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇందుకు కారణం వాళ్ల ఎల్‌పీ నంబరు ఆన్‌లైన్‌లో లాక్ అయి ఉండడం.. దీంతో కొన్ని మండలాల తహసీల్దార్లు డీఎల్ఆర్ విస్తీర్ణంలో సవరణల కోసం ప్రతిపాదనలను ఆర్‌డీవో/సబ్ కలెక్టర్ ద్వారా కలెక్టరేట్‌కు పంపించారు.

అడంగల్ పొందలేక..

ఈ ప్రతిపాదనలకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో లాక్ అయిన ఎల్‌పీఎం నంబర్లు, మండల, గ్రామ సర్వేయర్ల రిపోర్టులు, ఇతరత్రా పత్రాలను కూడా నివేదించారు. అయితే కలెక్టరేట్‌లో నెలల తరబడి వీటిని క్లియర్ చేయడంలో జాప్యం జరుగుతోంది. వీటికి సంబంధించి సర్వే ఏడీ, ఆర్‌డీవో/సబ్ కలెక్టర్ రిమార్కులను పొందుపరచాల్సి ఉంది. అప్పుడే జాయింట్ కలెక్టర్ వద్ద ఫైల్ క్లియర్ అయి సుమోటో కరెక్షన్స్ వెబ్‌ల్యాండ్‌లో జరుగుతాయి. నెలల తరబడి కలెక్టరేట్‌లో ఫైళ్లు పెండింగ్‌లో ఉండటంతో సుమోటో కరెక్షన్స్ జరగని రైతులు అడంగల్ పొందలేక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు కూడా తీసుకోలేని పరిస్థితి. అలానే భూములు విక్రయించుకోవాలన్నా కుదరడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ రెవెన్యూకి సంబంధించిన సమస్యలపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతోన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతం..ఆర్థిక అంతరాలకు పరిష్కారం

● ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ అంజయ్య

బాపట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కార మార్గమని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని అంజయ్య అన్నారు. బ్యాంక్ బాపట్ల బ్రాంచ్, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025.. సదస్సును శుక్రవారం బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ ఆడిటోరియం నందు అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అచార్య నన్నపనేని అంజయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 13 ఏళ్ళల్లో రెండోవసారి సహకార సంస్థగా ప్రకటించడం సహకార వ్యవస్థ ప్రధాన్యతను మరింత విస్తృత చేస్తుందన్నారు. బ్రాంచ్ ఇన్‌చార్జి డైరెక్టర్, బ్యాంక్ చార్టెడ్ అకౌంట్ పి.వెంకటమల్లికార్జునరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో 1916 ఫిబ్రవరి 5వ తేదిన కార్యక్రమాలు ప్రారంభించిన బ్యాంక్ నేడు తెలుగు రాష్ట్రాలలో 57 బ్రాంచ్‌ల ద్వారా బహుళ రాష్ట్రాల అర్బన్ బ్యాంక్‌గా ప్రజలకు సేవలందిస్తుందని తెలిపారు. అనంతరం భారత ఆర్థిక వ్యవస్థలో సహకార సంఘాల పాత్ర, సమాజంలో సహకార సంఘాలపాత్ర అనే రెండు అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి.. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

● ఏఎన్‌యూలో పూలేకు ఘన నివాళి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ, రెక్టార్

ఏఎన్‌యూ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని పూలే అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఆచార్య ఎం.త్రిమూర్తిరావు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, ప్రిన్సిపాళ్లు సురేష్‌కుమార్, వీరయ్య, సమన్వయకర్త త్రిమూర్తిరావు స్థానిక పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. నేటి యువత పూలే మార్గంలో పయనించాలని కోరారు. రెక్టార్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ పూలే సేవలు ఏనలేనివన్నారు. సమన్వయకర్త త్రిమూర్తిరావు మాట్లాడుతూ పూలే కేంద్రం ఆధ్వర్యంలో పలు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తూ ఆయన ఆశయాలను సమాజంలోకి తీసుకెళుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణ పోరులో..భాగమవుతాం

● ఏఎన్‌యూ సీఎస్ఆర్ డైరెక్టర్ భవిత

ఏఎన్‌యూ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ డైరెక్టర్ డాక్టర్ బి. భవిత ఆధ్వర్యంలో మంగళగిరిలోని 6వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీసులో.. ఈగల్ టీం ఎస్పీ కె.నగేష్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ భవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతను మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి బయటకు తెచ్చేందుకు చేస్తున్న కృషిలో భాగమవుతామని చెప్పారు. వర్సిటీ ఉన్నతాధికారుల సూచనలతో వివిధ కళాశాలలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ఈగల్ టీంకు, ప్రభుత్వానికి.. సీఎస్ఆర్ ద్వారా తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఎస్పీ నగేష్ స్పందిస్తూ.. సమాజంలో నెలకొన్న మాదక ద్రవ్యాల నియంత్రణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సంయుక్తంగా కార్యక్రమాల నిర్వహణకు తమ సిబ్బందికి సూచనలు చేస్తామని చెప్పారు. సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఫైన్ ఆర్ట్స్ విభాగపు కో-ఆర్డినేటర్ పి.దేవకాంత్, ఈగల్ టీం గుంటూరు ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ నగేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ఆర్ బృందం

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆయా ప్రాంతాలకు 41 ప్రత్యేక రైళ్లను నడుపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి - షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి 2026 మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు,డిసెంబర్2 నుంచి 9వరకు (మంగళ) రామేశ్వరం-తిరుపతి (06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని అధికారులు తెలియజేశారు.

విశాఖపట్టణం మార్గంలో కొన్ని రైళ్ల రద్దు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం మార్గంలో భద్రత, ఆధునికీ కరణ పనుల కారణంగా కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఈస్టు కోస్టు రైల్వే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నంబరు. 17239 గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రె స్ జనవరి 28వ తేదీ నుంచి 30 వరకు, 17240 విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జనవరి 29 నుంచి 31 వరకు, 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జనవరి 29, 30, 12805 విశాఖ పట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జనవరి 28, 29 తేదీల్లో రద్దు చేశామని పేర్కొన్నది. అలానే 22707 విశాఖపట్టణం - తిరుపతి ఏసీ డబుల్ డెక్కర్ రైలుని జనవరి 29వ తేదీన, 22708 తిరుపతి - విశాఖపట్టణం డబుల్ డెక్కర్ రైలుని జనవరి 28వ తేదీన, 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ లను జనవరి 31వ తేదీన రద్దు చేస్తున్నామని తెలియజేసింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

లాడ్జి నిర్వాహకులకు కౌన్సెలింగ్

నరసరావుపేట లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జి నిర్వాహకులకు శుక్రవారం రెండో పట్టణ సీఐ సీహెచ్ ప్రభాకరరావు స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా లాడ్జిలను నడుపుకోవాలన్నారు. రూమ్ తీసుకున్న ప్రతి ఒక్కరి పూర్తి సమాచారం రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ లేఖ ప్రియాంక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జిల నిర్వాహకులు పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్యాంక్ కాలనీ సమీపంలోని ఒక గృహంలో వ్యభిచారం జరుగుతున్నదన్న సమాచారంతో శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు జరిపారు. వ్యభిచార గృహం నిర్వహకురాలిని, మరో ఇద్దరు పురుషులను అరెస్టు చేశారు. పట్టుబడ్డ ఇద్దరు మహిళలను హెచ్చరించి పంపారు. అసాంఘిక కార్యకలాపాలు జరిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా అర్బన్ సీఐ పి.రమేష్ హెచ్చరించారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూషనల్ ఇన్నోవేషనల్ కౌన్సిల్ (ఈడీసీ), వ్యవస్థాపక అభివృద్ధి సెల్ (ఈడీసీ) ఆధ్వర్యంలో ఒక కెరీర్ అవకాశంగా వ్యవస్థాపక ఆవిష్కరణ అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ గోలి గురునాథం పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ముప్పాళ్ళ విద్యార్థి ప్రతిభ


ఉస్మాన్

ఈపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి ఎస్కే ఉస్మాన్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు తెలిపారు. కళాశాలలో జరిగిన వాలీబాల్ ఎంపిక పోటీల్లో పోస్టుమాన్ ప్రతిభ గణపతి యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. దక్షిణ మండల అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మాన్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరి రావు, అధ్యాపకులు అరవింద్, బలరాం నాయక్, సాయి ప్రసాద్, దాసు అభినందించారు.

మహిళల బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

ఈపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో శుక్రవారం నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు ప్రారంభించారు. పోటీలలో 8 జట్లు పాల్గొనగా నాకౌట్ ముగిసింది. నాలుగు జట్లు లీగ్ ప్రవేశించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలు శనివారంతో ముగుస్తాయన్నారు.

పోట్లూరు సర్పంచ్ ఆరోపణల్లో వాస్తవం లేదు: మండల తెలుగు యువత ధనుంజయ్

పోట్లూరు (శావల్యాపురం) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ తీర్మానాల్లో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి బిల్లులు పెట్టి పంచాయతీ ఖాతా నుంచి నగదు డ్రా చేశారని పోట్లూరు గ్రామసర్పంచ్ పోపూరి జ్యోతి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని మండల తెలుగు యువత అధ్యక్షుడు గోనుగుంట్ల ధనుంజయ్ అన్నారు. శావల్యాపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోట్లూరులో వైసీపీ తరపున గెలిచిన సర్పంచ్ జ్యోతి కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చినప్పటి నుంచి గ్రామపాలనను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపించారు. ప్రతి మూడు నెలలకోసారి గ్రామపంచాయతీ సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటిని కూడా సక్రమంగా నిర్వహించలేదన్నారు. గ్రామంలో కొన్ని సమస్యలను గ్రామస్థులు సొంత ఖర్చులతో పరిష్కరించారన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రెయిన్లు నిర్మించినందుకు పంచాయతీ కార్యదర్శి తీర్మానంచేసి బిల్లులు కూడా పెట్టాడన్నారు. ఈ నెల 22న రూ.3.90లక్షలు నగదు ఆమె బ్యాంక్ ఖాతాకు జమ చేయడం జరిగిందని, సాంకేతిక సమస్య కారణంగా మరికొంత బిల్లును చెల్లించాల్సి ఉందన్నారు. సర్పంచ్ సమక్షంలో గ్రామంలో మరికొన్ని అభివృద్ధి పనులకు ఇటీవల పంచాయతీ తీర్మానాలుచేసి పనులు పూర్తి కాగానే బిల్లులు కూడా చెల్లించడం జరిగిందన్నారు. డ్రైనేజీలకు బిల్లులివ్వకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులు పెడుతున్నారని సర్పంచ్ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సర్పంచ్ విధులు సక్రమంగా నిర్వహించకపోగా అధికారులపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైన విధానం కాదన్నారు. వార్డుమెంబర్ పొందూరి శ్రీనివాసరావు, సాగు నీటిసంఘం మాజీ అధ్యక్షుడు పొందూరి సుబ్బయ్య ఉన్నారు.

పూలే ఆశయాలు ఆదర్శనీయం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, నాయకులు

వినుకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు ఆదర్శనీయమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని జీవీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే 135వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే భారత సమాజ చరిత్రలో మహానుభావుడని, వెనుకబడిన వర్గాల విద్య, హక్కుల కోసం అమూల్యమైన పోరాటంచేసిన మహోన్నత సేవా పురుషుడని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడానికి, అణగారిన వర్గాలకు వెలుగునిచ్చేందుకు పూలే చూపిన మార్గం నేటి యువతకు స్ఫూర్తిదాయకయమన్నారు. కార్యక్రమంలో వినుకొండ పట్టణ నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యాప్తికి పూలే కృషి: అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంస్కరణలకు, విద్యావ్యాప్తికి, దళితులు, శూద్రుల హక్కుల కోసం జ్యోతిరావుపూలే నిరంతరం పోరాడారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలో జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్నాడు బస్టాండ్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే భారతదేశ తొలి తాత్వికుడు అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

● దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే 135 జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్నాడు రోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గోదా రమేష్‌కుమార్, పూనూరి కృష్ణకుమారి, సెయింట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వంకాయలపాటి రవి, ఎన్నా రవీంద్ర రెడ్డి, బీజేపీ అమ్మాజీలానీ, తదితరుల పాల్గొన్నారు.

● పట్టణంలోని పల్నాడు బస్టాండ్‌లోని మహాత్మ జ్యోతిరావుపూలే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి 135 జయంతి సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటనాయక్, శాంతకుమార్, పీడీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, నల్లపాటి రామారావు, ఊటుకూరు పాపారావు, విజయ్‌కుమార్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్నా, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

● బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 135 జయంతి కార్యక్రమం నరసరావుపేట పట్టణంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, జిల్లా అధ్యక్షుడు యామా మురళి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాంప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, నాగారపు ఆంజనేయులు, గాలి సాంబశివరావు, సరికొండ తిమ్మరాజు, సుతారం విశ్వేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, మొగలపువ్వు నాగలక్ష్మి, దమ్మాటి మల్లికార్జున, ఫణదం బోసు, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: అట్టడుగు, బడుగు బలహీన వర్గాల, మహిళల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే అని పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలతో కలిసి పల్నాడు రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. నరసరావుపేటలో బీసీ భవన్ కోసం వైసీపీ ప్రభుత్వం 15సెంట్లు స్థలం కలెక్టరేట్ వద్ద కేటాయించామన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ స్థలాన్ని క్యాన్సిల్ చేసి అంగన్‌వాడి సెంటర్‌ను, ఇతర భవనాలకు మళ్ళించడం జరిగిందన్నారు. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే బీసీ వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ బీసీ భవన్ కోసం స్థలం కేటాయించలేకపోవటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కార్యాలయంలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా వైసీపీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బొల్లాపల్లి: మండలంలోని గండిగనుములలో రాష్ట్ర గిరిజన ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కోటా నాయక్ పాల్గొన్నారు.

భూములకు నష్టపరిహారం ఇప్పించండి

● ఎమ్మెల్యే పుల్లారావుకు రైతుల విజ్ఞప్తి

చిలకలూరిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు వాడరేవు 167ఏ జాతీయ రహదారి విస్తరణకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు రైతులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పుల్లారావు చిలకలూరిపేటలోని తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బారులో రైతులు పాల్గొని తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రైతులకు జరిగిన నష్టం గత పాలకుల పాపాల ఫలితమేనన్నారు. రోడ్ల కోసం భూములు, స్థలాలు, ఇళ్ల ఇచ్చిన వారికి అన్యాయం జరగడాన్ని సహించబోమన్నారు. అవసరమైతే టోల్ వసూలు కాలపరిమితి పెంచైనా రైతుల్ని ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయం జరిగేలా, వారికి సంతృప్తికరమైన ధర ఇవ్వాలని, చట్టాలున్నాయని రైతులను ఇబ్బందిపెట్టేలా వ్యవహరిస్తామంటే సమస్య ఇంకా జటిలం అవుతుందన్నారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందని, రైతులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. పట్టణానికి చుట్టు పక్కలున్న భూముల్లో అనధికార లేఅవుట్లు, అక్రమ రిజిస్ట్రేషన్లు, అడ్డగోలుగా సాగాయన్నారు. వైసీపీ హయాంలో కాల్వలు, డొంకలు, వాగులు, వంకలు సహా చివరకు ప్రభుత్వ భూములను కూడా అమ్మకానికి పెట్టేసి కోట్లు కొల్లగొట్టేసి నేడు ప్రజలకు ముఖం చాటేశారని విమర్శించారు. వారు చేసిన పాపాల నుంచి తమను కాపాడాలంటూ భూములు కొన్నవారు దిక్కుతోచని స్థితిలో నేడు తమను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. మధ్య, దిగువ తరగతి ప్రజల ఆశల్ని సొమ్ముచేసుకున్న గత పాలకుల్ని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు.

47 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట నియోజకవర్గంలోని 47 మందికి రూ.21.61 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందచేశారు.

అభిప్రాయ భేదాలతో పార్టీకి నష్టం

నాదెండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ నాయకుల మధ్య అభిప్రాయ బేదాలు ఏ పార్టీకి


సరస్వతి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పుల్లారావు, డాక్టర్ అరవింద బాబు

మంచిది కాదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని సాతులూరు, చందవరం గ్రామాల్లో శుక్రవారం జరిగిన రైతన్న నీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాతులూరులో పుల్లారావు మాట్లాడుతూ పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉంటేనే రాష్ట్రాభివృద్ధి తక్కువ సమయంలోనే సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు కష్టం, లోకేశ్ శ్రమ, పవన్ కల్యాణ్ ఆలోచనలు గ్రహించి కూటమి పార్టీల శ్రేణులు సంయమనంతో, సహనంతో వ్యవహరించాలన్నారు. రాష్ట్ర రైతాంగం పరిస్థితి ఈ ఏడాది బాగోలేదని, తుఫాన్‌ల వల్ల అన్ని పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. రైతులకు న్యాయంచేసి వారి సంపద పెంచాలన్న ఆలోచనతోనే ముఖ్యమంత్రి రైతన్నా మీ కోసం


ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కార్యక్రమం చేపట్టారని వివరించారు.

పేద విద్యార్థులను అగ్రస్థానంలో నిలిపేందుకు లోకేశ్ కృషి

నాణ్యమైన విద్యా బోధన విషయంలో రాజీ పడవద్దని, విద్యార్థులను దేశం గర్వించేలా అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పుల్లారావు అన్నారు. సాతులూరు గ్రామంలోని వెంకటప్పయ్య ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే అరవిందబాబుతో కలసి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అరవిందబాబు ఇచ్చిన సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదే విధంగా కొత్తగా నిర్మించిన డిజిటల్ ల్యాబ్, తరగతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి నిధులు కావాలని కోరిన వెంటనే మంత్రి లోకేశ్ స్పందిస్తున్నారన్నారు. వ్యవసాయంపై ఆధార పడి జీవించే పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా బోధన చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు సొంత నిధులతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయటాన్ని అభినందించారు. పౌల్ట్రీ సంస్థల అధినేత గడ్డం బుచ్చారావు చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ తక్కువ సమయంలో మంత్రి లోకేశ్ విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చారన్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, సర్పంచ్ శోభారాణి, నాయకులు సదాశివరావు, సత్యనారాయణ, వీరారెడ్డి, శరభయ్య, వెంకటరామిరెడ్డి, మదన్ మోహన్, గుర్రం నాగ పూర్ణచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం మా బాధ్యత

● ప్రజలకు జీవీ ఆంజనేయులు హామీ

వినుకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే, వాటి పరిష్కారం మా ప్రధాన బాధ్యతని చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. చీఫ్‌విప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జీవీకి వినతిపత్రాలు అందజేశారు. స్వీకరించిన అర్జీలను వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కారించాలని, సమస్య పరిష్కారం అయిన వెంటనే వాటి వివరాలను చీఫ్‌విప్ కార్యాలయానికి సందేశంలో తెలపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్ వల్ల ప్రజలతో నేరుగా మాట్లాడే వేదిక లభిస్తుందన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల మరియు పట్టణస్థాయి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాధవ హాస్పిటల్ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం

వినుకొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన యాదగిరి లక్ష్మి (20) మృతిపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని పల్నాడు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో రవికుమార్‌ను ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌లో లక్ష్మి భర్త యోగయ్య, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని జీవీ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. దీనిపై పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వోతో ఫోన్ మాట్లాడి నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. అలాగే వినుకొండ పట్టణ సీఐతో మాట్లాడుతూ లక్ష్మి కేసుపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలన్నారు.

పది విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా తీర్చిదిద్దాలి

● మండల విద్యాశాఖాధికారి సాంబశివరావు

పోట్లూరు (శావల్యాపురం) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగనున్న కామన్ పరీక్షలలో పదో తరగతి విద్యార్థులంతా నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని పోట్లూరు జడ్పీ పాఠశాలను ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారితో కలసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లోని సామర్థ్యాలు, బోధన ప్రణాళికలు, వెనుకబడిన విద్యార్థుల వివరాలు హెచ్ఎం అన్నపూర్ణమ్మని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి పది విద్యార్థుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డీఈవో చంద్రకళ ఆదేశాల మేరకు పది విద్యార్థులకు 100రోజుల టీచింగ్ ప్లాన్‌ని ఉపాధ్యాయులంతా పక్కాగా అమలు చేయాలని, సీ, డీ గ్రేడు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని ఉత్తీర్ణులను చేయాలన్నారు. గతంలో పాఠశాల్లో సాధించిన దానికంటే మెరుగైన ఫలితాలు సాధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. హెచ్ఎం నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.


కనమర్లపూడి వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి

పొలాలకు వెళ్ళేందుకు దారి ఏర్పాటు చేయరూ..

● రైల్వే అధికారులకు కనమర్లపూడి రైతుల వినతి

కనమర్లపూడి (శావల్యాపురం) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-గుంతకల్ రైల్వే మార్గంలో శావల్యాపురం మండలం కనమర్లపూడి వద్ద కొత్తగా నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పక్కగా రైతులు పొలాలకెళ్ళేందుకు వీలుగా రైల్వే అధికారులు దారి ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కోరారు. వారు మాట్లాడుతూ ఆర్‌యూబీ అవతల వైపు గ్రామానికి చెందిన రైతులకు 200 ఎకరాల సాగు భూమి ఉందని, ఆర్‌యూబీ నిర్మించాక రైతులు పొలాలకు పిచికలపాలెం వెళ్లేందుకు 2కిమీమేర చుట్టూ తిరిగి రావలసి ఉంటుందన్నారు. రైతులు, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎంఈవో పార్వతి

బొల్లాపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లాపల్లి జడ్పీ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఈవో కే పార్వతి శుక్రవారం అన్నారు. ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో పార్వతి, ఎస్ఐ సమీర్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, ఎస్‌వీ చారిటీ ఫౌండర్ పోకా వెంకటరావు పాల్గొని స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం రెండు వందల మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెదరెడ్డిపాలెంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెంలో శుక్రవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకోసం అన్నివిధాలా శ్రమిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలను వివరించారు. రైతులు ఆధునిక వ్యవసాయం, మెళకువలు నేర్చుకోవాలని, లాభసాటి వ్యవసాయం చేయాలన్నారు. రైతులు పండిస్తున్న పంటలకు రసాయనికి ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతులకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ర్యాలీ చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

డ్వాక్రా సంఘాల పారదర్శకతకు ప్రత్యేక యాప్

● నిర్వహణపై ఈ-నారీలకు శిక్షణ ● గ్రామంలో అవగాహన ర్యాలీ

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల నిర్వహణ పారదర్శకంగా చేపట్టేందుకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని వెలుగు ఏపీఎం భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఈ-నారీలకు 'మన డబ్బులు-మన లెక్కలు' యాప్ నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం మండల వెలుగు కార్యాలయం నుంచి ఈ-నారీ యాప్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం భరత్ మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా సంఘాల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ యాప్ వినియోగంపై సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ-నారీలను ఏర్పాటు చేశామన్నారు. నరసరావుపేట మండలంలో 2018 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయిని, ఐదు గ్రూపులకు ఒక ఈ-నారీ చొప్పున 350 మందిని గుర్తించాల్సి ఉందన్నారు. మండలంలో 70 గ్రామ సమైఖ్య సంఘాలు ఉన్నాయి. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు 10వ తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 45 సంవత్సరాలలోపు వారై, గ్రామంలోని ఏదైనా స్వయం సహాయక సంఘాలోని సభ్యులై ఉన్నవారిని ఈ - నారీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, యానిమినేటర్లు పాల్గొన్నారు.


సత్కారం పొందిన వాసవి క్లబ్ అధ్యక్షుడు అయితా వెంకట ప్రసాద్, తదితరులు

చిలకలూరిపేట వాసవి క్లబ్‌కు 10 అవార్డులు

చిలకలూరిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి క్లబ్ ద్వారా చేసిన పలు సేవా కార్యక్రమాలకు గాను జిల్లా స్థాయిలో క్లబ్‌కు 10 అవార్డులు లభించాయి. స్థానిక చౌత్రా సెంటర్‌లోని వాసవి జ్ఞాన మందిరంలో ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో క్లబ్ జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక క్లబ్ అధ్యక్షులు అయితా వెంకట ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కొత్తమాసు పూర్ణచంద్రరావు, కోశాధికారి శనగపల్లి వెంకటేశ్వరరావు, రీజియన్ చైర్మన్ రాచుమల్లు అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి పోతుగంటి రమేష్, జిల్లా కోశాధికారి వెల్లంపల్లి కేశవరావు, మద్ది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనధికారంగా నిర్మించిన భవనాలు రెగ్యులరైజ్ చేసుకునేందుకుగాను బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్-2025)పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. పట్టణంలోని యస్.యన్.ఆర్. కన్వెషన్ నందు పల్నాడు జిల్లాలో ఉన్న అన్ని మునిసిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ అధికారులు, డబ్ల్యూపీఆర్ఎస్, లైసెన్స్ టెక్నికల్ పర్సనల్స్‌తో అవగాహన సదస్సును ప్రాంతీయ ఉప సంచాలకులు, టౌన్ కంట్రీ ప్లానింగ్, ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమములో అధికారులు, లైసెన్స్ టెక్నికల్ పర్సనల్స్‌లకు ఈ పథకాల అమలు ప్రక్రియ, దరఖాస్తు గడువులు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, పీనలైజేషన్ చార్జీల గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లాలోని అన్ని మునిసిపాలిటిలోని టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్, లైసెన్స్ టెక్నికల్ పర్సనల్స్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి విద్యను అందించటమే లక్ష్యం

● ఎస్ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అంతర్జాతీయ సాయిలో విద్యను అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. కర్టిన్ యూనివర్సిటీతో ఎంవోయూ గ్లోబల్ కెరీర్ వైపు మరొక బలమైన అడుగు అన్నారు. ఈ సందర్భంలో డైరెక్టర్ సుహాసిని మిట్టపల్లి, కళాశాల చైర్మన్ ఎం.వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.